# అపవాదు

"నిన్న మా ఆఫీసులో ఒక గమ్మత్తయిన సంఘటన జరిగిందంకుల్" అంటూ వచ్చాడు ఆ సాయంత్రం, వినోద్, మా ఇంటికి. నేనేదో పనిలో ఉన్నానని గమనించి కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

వినోద్ నా ప్రియమిత్రుడు, సుగుణాకర్ కొడుకు. ఎం.బీ.ఏ. ప్యాసై యేదో ఇన్సూరెన్స్ కంపెనీలో అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి తను ఎదురుకుంటున్న సమస్యల్ని చెప్పుకొని పరిష్కారాల్ని సూచించమంటాడు.

వినోద్‌కు వాళ్ళ నాన్నంటే కొన్ని సంకోచాలున్నాయి. "నువ్వు యే పనీ సరిగ్గా చెయ్యవనీ" వాళ్ళ నాన్న వినోద్ మీద విసుక్కుంటాడట. వాళ్ళ నాన్నతోకంటే వినోద్‌కు నాతోటే ఎక్కువ చనువుంది.

"మా నాన్నకు నామీద ప్రేమలేదంకుల్. ఆయనకు ఆయన కూతురిమీదే ప్రేమ. ఎప్పుడూ దాన్నే మెచ్చుకుంటాడు. నన్నేమో ఎందుకూ పనికి రానివాడివన్నట్టుగా చూస్తుంటాడు" అని, నాతో చాలాసార్లు చెప్పాడు.

"అలాంటిదేమీ ఉండదులే వినోద్. నువ్వు మీ నాన్నను అపార్థం చేసుకుంటున్నావు. తల్లిదండ్రులకెవరికైనా వాళ్ళ పిల్లలందరి మీద సమానమైన ప్రేమే ఉంటుంది..." అని నేనతనికి చెబుతుండేవాడిని.

ప్రతీ చిన్న విషయానిక్కూడా వినోద్ అతిగా స్పందించటం నేను గమనించాను.

వినోద్ వచ్చినప్పుడు నేను డైరీ రాస్తున్నాను. ఆ పనిని పక్కనపెట్టి

"యేమిటా గమ్మత్తయిన సంఘటన?" అన్నాను వినోద్‌కేసి చూసి. నేను చేస్తున్న పని ముగించేలోగా, వినోద్ మా ఇంటి హాల్లోకెళ్ళి ఫ్రిజ్ ఓపెన్‌చేసి ఓ మంచినీళ్ళ బాటిల్ తెచ్చుకున్నాడు.

"చెబుతానంకుల్..." అంటూ మంచినీళ్ళు తాగటం పూర్తిచేశాడు. అతన్ని చూస్తోంటే అతడేదో టెన్షన్‌లో ఉన్నట్టు నాకర్థమయింది.

"నిన్న మా ఆఫీసుకు ఓ పాతికేళ్ళావిడొచ్చిందంకుల్... చాలా అందంగా, చాలా పాలిష్‌డ్‌గా ఉందామె... ఆమెను చూస్తే ఎవరికైనా ఆమె మీద చాలా మంచి అభిప్రాయం కల్గుతుంది. మా ఆఫీసులో అందరూ ఆమెకేసి కాస్సేపు కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయారు. ఆమె మా ఆఫీసుకెందుకొచ్చిందంటే తనది, తన హజ్బెండ్‌ది... పాలసీ ప్రీమియం చెల్లించడానికి... నిన్న క్యాష్ కౌంటర్‌లో మా కొలీగ్ యుగంధరున్నాడు. ఆ యుగంధర్ అనేవాడు చాలా షార్ట్‌టెంపర్డ్ ఫెల్లో... ఆమె

ప్రీమియం ఎమౌంట్ ఐదువేలు యుగంధర్‌కిచ్చింది. అన్నీ వందరూపాయల నోట్లే... నా సీటు క్యాష్ కౌంటర్ దగ్గరే ఉండటం వల్ల క్యాష్ కౌంటర్లో యేం జరుగుతున్నదో నేను గమనిస్తుంటాను. యుగంధర్ ఆమె ఇచ్చిన క్యాష్‌ను గబాగబా లెక్కించేసి "వంద తక్కువిచ్చావు" అన్నాడు. ఆమె చాలా కాన్ఫిడెంట్‌గా నేను కరెక్ట్‌గానే ఇచ్చాను. మీరు మరోసారి లెక్కించండి" అంది. అంతే! మా యుగంధర్‌కు చాలా కోపమొచ్చేసింది.

"అఫ్టరాల్, నీ వందరూపాయల కోసం నేను అబద్ధమాడుతున్నాను కుంటున్నావా? లేక నీ వంద రూపాయల్ని నేను నొక్కేసాననుకుంటున్నావా? నీ క్యాష్ నువ్వే లెక్కపెట్టుకో" అంటూ ఆమె ఇచ్చిన ఆ క్యాష్‌నంతా ఆమె ముందుకు చాలా నిర్లక్ష్యంగా తోసేశాడు. దాంతో ఆమె చాలా హర్టయిపోయింది.

"మరోసారి లెక్కించండి అన్నందుకు మీరింత కోపానికొస్తున్నారేమిటి? నేను మీ కస్టమర్‌ని. మీ కస్టమర్స్‌తో మీరిలా ప్రవర్తించడం బాగాలేదు" అందామె చాలా మర్యాదగానే.

అతడేమో ఆమెను ఏకవచనంతో సంబోధిస్తుంటే ఆమేమో అతన్ని బహువచనంలో సంబోధిస్తున్నది.

"నీలాంటి కస్టమర్స్‌తో మేమిలాగే ప్రవర్తిస్తాం... మేం రోజూ ఎందరో కస్టమర్స్‌తో డీల్ చెయ్యాలి. వంద తక్కువుందని చెబితే వెంటనే ఆ వంద కలిపి ఇచ్చేసి నీ రిసీట్ తీసుకొని వెళ్ళకుండా నాతో అనవసరంగా... నేనేదో నీ వంద నొక్కేసినట్టుగా ఆర్గ్యూ చేస్తూ నా టైమంతా వేస్ట్ చేస్తావేమిటి?" అన్నాడు యుగంధర్.

"నేను ఆర్గ్యూ చేశానా? మరోసారి లెక్కించండి అని రిక్వెస్ట్ చేశాను. అంతమాత్రానికే ఆర్గ్యూ చేశానంటారేమిటి?" అందామె చాలా బాధగా.

నాకామె మీద చాలా సింపతీ కల్గింది. యుగంధర్ తరఫున నేను వెళ్ళి ఆమెకు సారీ చెప్పాలనిపించింది.

"నేను నీముందే లెక్కించాను కదా. వంద తక్కువుందని చెబితే ఒప్పుకోవెందుకు? నువ్విచ్చిన క్యాష్‌ను పదిసార్లు లెక్కబెట్టేంత టైమ్ నాకు లేదు. నీవెనుక ఎంతమంది కస్టమర్లున్నారో ఓసారి చూడు. ఆ క్యాష్‌కు వంద కలిపిస్తావా? లేక పక్కకు తప్పుకొని తీరికగా లెక్కపెట్టుకుంటావా?" గొంతు పెంచి కొట్టినట్టుగా అరిచాడు యుగంధర్.

"ఎందుకంతగా గొంతు చించుకుంటున్నారు. చెప్పేదేదో మర్యాదగా చెప్పొచ్చుగా... ఈ ఆఫీసులో ఇంత మొరటుగా ప్రవర్తించే వాళ్లుంటారని నాకు తెలీదు... మ్యానర్‌లెస్ ఫెల్లోస్" అంటూ పక్కకు తప్పుకుందామె.

"మ్యానర్స్ లేంది నాకు కాదు... నీకు. వొట్టిపుణ్యానికే నేను నీ దగ్గర్నుంచి వంద కొట్టేసినట్టుగా మాట్లాడుతున్నావు" అన్నాడు యుగంధర్.

"మీరు వంద కొట్టేశారన్లేదు. మరోసారి కౌంట్ చెయ్యండి అన్నాను" అందామె.

"నీతో నాకు ఆర్యుమెంట్ అనవసరం" అంటూ యుగంధర్ నెక్స్ట్ అన్నాడు, ఆమె వెనక ఉన్న కస్టమర్ దగ్గర్నుండి క్యాష్ తీసుకుంటూ.

"మీ మేనేజరెక్కడ?" అంటూ ఆమె మా మేనేజర్ కూర్చున్న గదిలోకెళ్ళింది. యేం జరిగిందో తెలుసుకున్న మేనేజర్ ఆమె ఇచ్చిన క్యాష్ తీసుకొని తనే లెక్కించాడు. ఆమె చెప్పిందే కరెక్ట్ అని తేలింది. రెండు నోట్లు ఒకదానితో ఒకటి అతుక్కుపోవడం వల్ల యుగంధర్ ఒక వంద తక్కువుందనుకున్నాడు. మా మేనేజర్ ఆమెకు సారీ చెప్పి, అతడే క్యాష్ కౌంటర్ దగ్గరకొచ్చి, ఆ ఎమౌంట్ పేచేసి, ఆమెకు రిసీట్స్ ఇచ్చి పంపించేశాడు.

ఇది జరిగాక లంచ్ టైమ్‌లో యుగంధర్, నేను క్యాంటీన్లోకెళ్ళాం. యుగంధర్ నేనూ పక్కపక్కనే కూర్చున్నాం. యుగంధర్ ఆమెతో చాలా దురుసుగా ప్రవర్తించాడని నాకు పదేపదే గుర్తురాసాగింది.

"మీరీరోజు ఆమెతో ప్రవర్తించిన తీరు బాగాలేదు" అన్నాను.

"బాగాలేదా? ఎందుకు బాగాలేదు?" అన్నాడతడు చాలా నిర్లక్ష్యంగా... అతనిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదు.

"మన కస్టమర్లతో అంత దురుసుగా ప్రవర్తించటం అవసరమా? మన ఆఫీసు ప్రతిష్ట దిగజారిపోదూ?" అన్నాను.

"దురుసుగా ప్రవర్తించానా? యేం మాట్లాడుతున్నావు నువ్వు? ఆమె ఎర్రగా బుర్రగా ఉందని ఆమె ప్రేమలో పడిపోయావా? కాస్త అందంగా, కాస్త సెక్సీగా కనిపించే ఆడపిల్లల్ని చూస్తే నీలాంటి బ్రహ్మచారులకు మతిపోతుందనుకుంటాను" అన్నాడతడు చాలా కోపంగా.

"అందం గురించి కాదిక్కడ మనం మాట్లాడుతున్నది. ఆమెతోటే కాదు... ఎవరితోనైనా మీరలా దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించటం బావుండదు అంటున్నాను. ఈ ఆఫీసులో పనిచేసే వాళ్ళందరికీ మ్యానర్స్ లేవనుకుంటారు" అన్నాన్నేను చాలా శాంతంగానే.

నాకు మ్యానర్స్ లేవా? నీకే ఉన్నాయనుకుంటున్నావా? ఆమేదో నీ ప్రాపర్టీ అయిపోయినట్టు మాట్లాడుతున్నావేమిటి?" అన్నాడతడు.

"ఇట్స్ నాట్ ది క్వశ్చన్ ఆఫ్ ప్రాపర్టీ ఆర్ ఎనీథింగ్ ఎల్స్... ఇట్స్‌ది క్వశ్చన్ ఆఫ్ మ్యానర్స్... మనం మన కస్టమర్స్‌తో మర్యాదగా ఉండాలంటున్నాను" అన్నాను.

"నా మ్యానర్స్ గురించి మాట్లాడటానికి నువ్వెవరివోయ్... దిసీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్. నీకనవసరమైన విషయాల్లో తలదూర్చుకు. అదేదో ఎర్రగా బుర్రగా ఉందని దానిమీద మనస్సు పారేసుకున్నట్టున్నావు... అంత తీటగా ఉంటే వెళ్ళి దాన్ని కలుసుకో. కానీ నా జోలికొస్తేమాత్రం నేనూరుకోను. జాగ్రత్త!" అన్నాడతడు చాలా కోపంగా.

"సారీ యుగంధర్ గారూ" అని నేనతని దగ్గర్నుంచి వెళ్ళిపోయాను.

అతడన్న ఆ చివరిమాట నాకు పదేపదే గుర్తొస్తున్నదంకుల్" అన్నాడు వినోద్.

"యే చివరిమాట?" అన్నాను.

"అనవసరంగా నా జోలికెవరన్నా వస్తే నేనూరుకోను... అన్నాడు కదా... ఆ మాట నాకు పదేపదే గుర్తొచ్చి భయమేస్తున్న దంకుల్..." అన్నాడు వినోద్.

"యేదో కాజువల్‌గా అనుంటాడులే..." అని నేనింకేదో చెప్పబోతోంటే.

"నేనూరుకోను అని అతడెందుకన్నాడంకుల్... అలా అనడంలో అతని ఉద్దేశ్యం నన్నెవరితోనైనా కొట్టిస్తాననా?" అన్నాడు.

"ఇంత చిన్నవిషయానికే అతడు నిన్ను ఎవరితోనైనా కొట్టిస్తాడేమోనని ఊహించుకొని భయపడ్తున్నావా? వద్దు వినోద్... అలాంటి ఊహలు నీ మైండ్‌లోకి రానివ్వకు..." అన్నాను.

"అతడు మంచివాడు కాదని మా ఆఫీసులో ఇద్దరు ముగ్గురు అనుకోగా విన్నాను... మా కొలీగ్ ఒకాయన యుగంధర్ జోలికెళ్ళొద్దని సలహా కూడా ఇచ్చాడు. ఈ రోజు నేను అనుకోకుండా అతని జోలికెళ్ళాను... ఆమెను చూస్తే చాలా మంచావిడ అనిపించింది. యుగంధర్ ఆమె తప్పేమీ లేకపోయినా ఆమెతో చాలా అమర్యాదగా మాట్లాడి ఆమెను హర్ట్ చేశాడనిపించింది. అందుకే నేనతనితో అలా మాట్లాడాను..." అన్నాడు వినోద్.

"నువ్వతనితో అలా మాట్లాడటంలో తప్పేమీలేదు వినోద్... కొందరికి తమ కస్టమర్లతో మర్యాదగా, శాంతంగా మసలుకోవడం తెలీదు. కస్టమర్లవల్లనే వాళ్ళక్కడ ఉద్యోగాలు చేసి తమ భార్యాపిల్లల్ని పోషించుకోగల్గుతున్నామన్న వాస్తవాన్ని మరచిపోతుంటారు. అలాంటివాళ్ళతో నువ్వలా మాట్లాడటం వల్ల వాళ్ళల్లో మార్పు రావచ్చు... కాబట్టి నువ్వు ఎలాంటి తప్పు చేయలేదు. ఇది చాలా చిన్నవిషయం... నువ్వు ఈ సంఘటనను వెంటనే నీ మైండ్‌లోంచి తీసెయ్యి... హాయిగా ఉండు" అన్నాను.

"నా జోలికొస్తే నేనూరుకోను అని అతడన్న మాటను నా మైండ్‌లోంచి తీసెయ్యలేకపోతున్నానంకుల్... అతడెవరన్నా రౌడీలతో నన్ను తన్నిస్తాడేమోనన్న భయం నన్ను వదలటం లేదు" అన్నాడు వినోద్.

"ఛీఛీ! అలాంటిదేమీ జరగదు. ఆ యుగంధర్, నువ్వూ ఒకేచోట... ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. అలాంటప్పుడు యేదో విషయంలో మీ ఇద్దరిమధ్య చిన్న ఆర్గ్యుమెంట్ జరగటం సహజం. అంతమాత్రానికే అతడు నిన్ను రౌడీలచేత తన్నిస్తాడని నువ్వూహించుకోకూడదు. అలా ఊహించుకుంటూ భయపడిపోవడం తప్పు... మనస్సు కోతిలాంటిది అంటారు... యేవేవో ఊహలొస్తుంటాయి... ఈ మనస్సనేదానికి వాస్తవిక దృష్టి ఉండదు. ఒక ఊహ దాన్లో ప్రవేశించిందంటే దాన్నే వల్లించుకుంటూ ఉంటుంది. అలా వల్లించుకోవడంలో దానికి కొంత ఆనందం కూడా కల్గుతుంటుంది. మనస్సు చెప్పినట్టు మనం వినకూడదు. మనం చెప్పినట్టు... అంటే మనలోని బుద్ధిచెప్పినట్టు మనస్సు వినాలి... బుద్ధి అంటే రీజన్... వివేకం... ఇది నిజమా? కాదా... ఇది మంచిదా? చెడ్డదా అని ఆలోచించే శక్తిని బుద్ధి అంటాం... ప్రతి వ్యక్తిలోనూ ఈ మనస్సు, ఈ బుద్ధి మధ్య కొంత సంఘర్షణ జరుగుతూ ఉంటుంది. ఆ సంఘర్షణలో బుద్ధే గెలవాలి... నీ విషయంలో కూడా అదే జరగాలి. నీ మనస్సును నీ బుద్ధి గెలవాలి" అన్నాను.

"యేమో అంకుల్... మీరు చెప్పింది నిజమే కావొచ్చు. కానీ నా మనస్సును నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను... ఆ యుగంధర్ నన్ను యేమన్నా చేస్తాడేమోనన్న భయం నన్ను వదలడం లేదు"

"ఆ యుగంధర్ నిన్నేమీ చెయ్యడు. నా మాట నమ్ము... నీకు నేనున్నాను... కావాలంటే నేనోసారి ఆ యుగంధర్‌తో మాట్లాడ్తాను" అన్నాను.

"నిజంగా మాట్లాడ్తారా అంకుల్... మిమ్మల్నందరూ గౌరవిస్తారు... మా ఆఫీసులో చాలామందికి మీరు తెలుసు... మీ రచనల్ని చదివి వాళ్ళు చర్చించుకోగా నేను విన్నాను... మీరు మాట్లాడితే ఆ యుగంధర్ నా జోలికి రాడు" అన్నాడు వినోద్.

"నేను యుగంధర్‌తో మాట్లాడ్తాను వినోద్. మీ మేనేజర్ దయానందరావు నాకు బాగా తెలుసు... అతనితో కూడా యుగంధర్‌కు చెప్పిస్తాను. నువ్వీ విషయాన్ని మరచిపోయి హాయిగా ఉండు..." అన్నాను.

"థాంక్స్ అంకుల్... మీతో మాట్లాడాక నా కాన్ఫిడెన్స్ లెవెల్ పెరిగింది" అంటూ వినోద్ వెళ్ళిపోయాడు.

* * * *

పదిరోజుల తర్వాత వినోద్ మళ్ళీ నా దగ్గరకొచ్చాడు.

"మీతో కాస్సేపు మాట్లాడాలని వచ్చానంకుల్... మీరు ఫ్రీగా ఉన్నారు కదా?" అన్నాడు.

"ఫ్రీగానే ఉన్నాను... చెప్పు వినోద్" అన్నాను.

"నిన్న మళ్ళీ ఓ సంఘటన జరిగిందంకుల్" అన్నాడు వినోద్.

"యేం జరిగింది?" అన్నాన్నేను.

"నిన్న నేను నా మోటారుబైక్ మీద ఆఫీసుకెళ్తున్నాను. 'నాగోల్' బస్‌స్టాపు దగ్గర బస్సుకోసం వెయిట్ చేస్తున్న ఓ కాలేజి అమ్మాయి కనిపించి నన్ను లిఫ్ట్ అడిగిందంకుల్... పాపం... ఆమె ఎంతసేపట్నించి బస్సుకోసం వెయిట్ చేస్తోందో... చాలా అలసిపోయినట్టుగా కనిపించింది. ఆమెకు లిఫ్ట్ ఇవ్వాలనిపించిందంకుల్... బైక్ ఆపి ఆమెను ఎక్కించుకున్నాను... యూనివర్సిటీ దగ్గర దింపమంది... ఆర్ట్స్ కాలేజి దగ్గర ఆపమంటే ఆపాను... ఆమె నా బైక్ దిగుతోంటే "శ్రావ్యా?" అంటూ ఆమెను పిలుస్తూ నా బైక్ దగ్గరకో ఇన్‌షర్ట్ వేసుకున్న స్టూడెంట్‌లా ఉన్నవ్యక్తి, వచ్చాడు. "హాయ్ ప్రదీప్!" అంటూ శ్రావ్య అతన్ని పలకరించింది. అతడామె బోయ్‌ఫ్రెండని నాకర్థమయ్యింది.

"ఇతని బైక్ మీదొచ్చావా? ఇతడెవరు?" అన్నాడా ప్రదీప్ నాకేసి అదో మాదిరిగా చూస్తూ...

"అతడెవరో నాకు తెలీదు... పాపం! చాలా మంచివాడిలా ఉన్నాడు. లిఫ్ట్ అడగ్గానే ఇచ్చాడు" అంది శ్రావ్య, ఇతడెవరో అమాయకుడిలా ఉన్నాడన్నట్టుగా నాకేసి చూస్తూ.

ప్రదీప్ మాత్రం నాకేసి ఇంకా అలాగే, అదోమాదిరిగా చూస్తూ "నీకందరూ మంచివాళ్ళలాగే కనిపిస్తార్లే... తెలియనివాళ్లను లిఫ్ట్ అడగొద్దని నీకెన్నిసార్లు చెప్పినా నువ్విలాగే చేస్తుంటావు..." అంటూ అతడు నాకేసి కోపంగా చూస్తూ "యేయ్ మిస్టర్! అందమైన ఆడపిల్ల అడిగింది కాబట్టి లిఫ్టిచ్చావు... అదే నాలాంటి వాడడిగితే ఇస్తావా? ఆడపిల్లలకిలా లిఫ్ట్ యిస్తూ మరోసారి కనిపించావో... జాగ్రత్త!" అన్నాడు. తర్వాత వాళ్ళిద్దరు చెట్టాపట్టాలేసుకొని ఆర్ట్స్ కాలేజిలోకి వెళ్ళిపోయారు. అతడామెతో వెళ్ళిపోతూ నాకేసి చూసిన ఆ చూపు, అతడన్న ఆ మాటలు పదేపదే గుర్తొస్తున్నాయంకుల్. అతడు నామీద పగబట్టి నన్నేమన్నా చేస్తాడేమోనని భయమేస్తోంది" అన్నాడు వినోద్... అతనిలో చిన్నగా వణుకు ప్రారంభమైంది... శరీరమంతా చెమటతో నిండిపోతున్నది...

"నువ్వు కాస్సేపు కామ్‌గా కూర్చో వినోద్..." అంటూ నేను లోపలికెళ్ళి ఫ్రిజ్‌లోంచి చల్లటి మంచినీళ్ళు తెచ్చిచ్చి అతన్ని తాగమన్నాను.

"జరిగిందేమీ లేదు... చాలా చిన్న విషయం. అతడి గర్ల్‌ఫ్రెండ్ నీ బైక్‌మీద కాస్సేపు కూర్చొని నిన్ను టచ్ చేసి ఉంటుందని అతడు కుళ్ళుకొని అలా అని ఉంటాడు. ఇట్స్ నథింగ్ సీరియస్... గర్ల్‌ఫ్రెండ్స్ విషయంలో బోయ్స్ చాలా టచ్చీగా ఉంటారు. వాళ్ళను తమ ప్రాపర్టీగా భావించి వాళ్ళను తాము తప్ప మరెవరూ ముట్టుకోకూడదు అనుకుంటారు. ఈ కారణం చేతనే అతడేదో వాగాడు... ఆ వాగుడును నువ్వెందుకంత సీరియస్‌గా తీసుకుంటావు?.. ఓ నవ్వు నవ్వేసి "ఐ పిటీయూ!" అనుకొని మరచిపోవాలి" అన్నాను.

"ఆమెకు నేను లిఫ్టిచ్చి తప్పు చేశానంటారా అంకుల్... నిజం చెప్పండి" అన్నాడు వినోద్.

"నువ్వేమీ తప్పు చెయ్యలేదు... నీమీద నీకు నమ్మకం ఉంటే తప్పు చేశానేమో అన్న భావనే నీకు రాకూడదు... కానీ నీ మనస్సు నీలో తప్పు చేశానేమో అన్న భావనను కల్గిస్తోంది... చెప్పానుగా... మనస్సు కోతిలాంటిదని. ఇలాంటి చిన్నచిన్న సంఘటనలకు కూడా మన మనస్సు మనలో ఇలాంటి ఊహల్ని ప్రేరేపిస్తుంటుంది. బుద్ధితో మనస్సును జయించాలి"

"అతడు నన్నేమీ చెయ్యడంటారా అంకుల్?"

"యేమీ చెయ్యడు... అతడెక్కడో... నువ్వెక్కడో... ఈ మహాసముద్రంలాటి నగరంలో అతడూ నువ్వూ మరోసారి కలుసుకునే అవకాశమే లేదు... అతడీ విషయాన్ని అప్పుడే మరచిపోయి ఉంటాడు. నువ్వే యేదోదే ఊహించుకొని నిన్ను నువ్వు దండించుకుంటున్నావు... నీలో అపరాధ భావన అనేది కొంచెం ఎక్కువగానే ఉంది... ప్రతి విషయంలోనూ నువ్వే యేదో తప్పు చేసినట్టుగా ఫీలవుతున్నావు... నువ్వేమీ తప్పు చెయ్యడం లేదు... ఈ అపరాధభావనను నీలోంచి తొలగించుకోవాలి వినోద్!"

"మనమేమీ తప్పు చెయ్యకపోయినా ఆ ప్రదీప్‌లాంటి వాళ్ళు మనమీద ద్వేషం పెంచుకొని మనకేదన్నా హాని తలపెడ్తారేమో... నేనతని గర్ల్‌ఫ్రెండ్‌ని అతన్నుంచి లాగేసుకున్నట్టుగా అతడు ఫీలై నామీద రివెంజ్ తీసుకోవాలని అనుకుంటాడేమోనని నాకు భయమేస్తోందంకుల్..." అంటూనే అతడు మళ్ళీ వణికిపోసాగాడు.

"నువ్వతని గర్ల్‌ఫ్రెండ్‌ని ఎప్పుడు లాగేసుకున్నావు? ఆమె అతనితోటే వెళ్ళిందికదా... నీలో ఒక నిరాధారమైన భయం యేర్పడుతున్నది... అతడు నీ జోలికి రాడు... అతడు నిన్ను మళ్ళీ కలుసుకునే అవకాశమే లేదు... నీమీద రివెంజ్ తీసుకునే ఛాన్సే లేదు... అతడీ విషయాన్ని అప్పుడే... ఆ క్షణంలోనే మరచిపోయి ఉంటాడు. నువ్వే యేదేదో ఊహించుకొని మరచిపోలేకపోతున్నావు... ప్లీజ్ ఫర్‌గెటిట్... అండ్ బీహ్యాపీ..."

ఈ ధోరణిలో అతనితో చాలాసేపు మాట్లాడి, అతనిలో ఆత్మవిశ్వాసాన్ని బలపడేట్టు చేసి పంపించాను.

వారం రోజుల తర్వాత అతడు నాకు ఫోన్ చేశాడు. "యేమైంది వినోద్?" అని అడిగితే

"నిన్న నేను రామాంతపూర్ నుండి బైక్‌మీద ఉప్పల్‌వైపు వెళ్తోంటే నన్ను ఐదారుగురు యూనివర్సిటీ స్టూడెంట్స్ వాళ్ళ బైక్స్ మీద ఛేజ్ చేశారంకుల్... వాళ్ళను ఆ ప్రదీపే పంపించాడని నా అనుమానం..."

"వరేయ్ వినోద్! బీకేర్‌ఫుల్... నీకు రోజులు దగ్గరపడ్డాయి" అని నన్ను వోవర్‌టేక్ చేసి అరచుకుంటూ వెళ్ళారంకుల్... భయంతో నేను ముందుకు కదలలేకపోయానంకుల్... బైక్ ఆపుకొని రోడ్డుపక్కనే ఉన్న బస్సుస్టాపులో చాలాసేపు కూర్చొని వాళ్ళు దూరంగా వెళ్ళిపోయారని కన్‌ఫర్మ్ చేసుకున్నాకే బైక్ స్టార్ట్ చేసుకొని ఇంటికెళ్ళానంకుల్" అన్నాడు వినోద్.

"నువ్వేం భయపడకు వినోద్... నిన్నెవర్ను ఛేజ్ చేశారో నేను కనుక్కుంటాను. నువ్వు కామ్‌గా ఉండు వినోద్... నీకేం కాదు... నీ ప్రాణానికి నా ప్రాణం... నువ్వు కామ్‌గా ఉండు" అన్నాను నేను.

"మనం పోలీసుల హెల్ప్ కూడా తీసుకుందామంకుల్" అన్నాడు వినోద్.

"అలాగే తీసుకుందాం... నువ్వు కామ్‌గా ఉండు" అన్నాను.

"అలాగే అంకుల్... మీరు తప్ప నాకీ ప్రపంచంలో ఎవరూ లేరంకుల్... బై అంకుల్" అని వినోద్ ఫోన్ పెట్టేశాడు.

వినోద్‌ను ఎవరూ ఛేజ్ చెయ్యలేదని, అది కేవలం అతడి మనస్సు కల్పించుకున్న భ్రమ మాత్రమే అని నాకు తెలుసు. కానీ అతడికామాట చెప్పి ప్రయోజనం ఉండదని నాకర్థమైంది.

అతనిలో పెరనాయిడ్ అనే వ్యాధి... లేని శత్రువుల్ని ఊహించుకొని వాళ్ళు తనకేదో హాని తలపెడ్తారని భయపడిపోవడం... ఈ వ్యాధి అతనిలో ముదిరిపోయింది. ఈ పరిస్థితుల్లో అతడు అతని మనస్సు చెప్పినట్టే వింటాడు తప్ప మనం యేమి చెప్పినా వినడు.

నేను వెంటనే వినోద్ వాళ్ళ నాన్న - సుగుణాకర్‌కు ఫోన్ చేసి మా ఇంటికోసారి రమ్మన్నాను. చాలా అర్జెంట్ అని కూడా చెప్పాను.

నేను ఫోన్ చేసిన మర్నాడు సుగుణాకర్ మా ఇంటికొచ్చాడు.

"ఈమధ్య మన వినోద్ ఎలా ఉంటున్నాడో నువ్వు గమనించావా?" అన్నాను.

వాడి గురించి నాకంటే ఎక్కువ నీకే తెలుసు కదా... యేదన్నా ఉంటే వాడు నీకే చెబుతాడు. వాడు నాతో ఎప్పుడూ యేదీ వివరంగా చెప్పడు" అన్నాడు సుగుణాకర్.

"వాడు రోజూ మామూలుగా ఆఫీసుకు వెళ్తున్నాడా?" అన్నాను.

"వెళ్ళడమైతే వెళ్తున్నాడు... కానీ ఎప్పుడూ యేదో పోగొట్టుకున్నట్టుగా, దిగులుగా కనిపిస్తున్నాడు. ఇంటికి రాగానే తన గదిలోకి వెళ్ళిపోతాడు. అన్నం తిందువు రమ్మని వాళ్ళమ్మ ఎన్నోసార్లు పిలిస్తే వచ్చి అన్నం తిని, తన గదిలోకి వెళ్ళిపోతాడు" అన్నాడు సుగుణాకర్.

"వాడి విషయంలో నీకో సలహా ఇవ్వాలనుకుంటున్నాను... నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు"

"నిన్ను అపార్థం చేసుకోవడమేమిటి? అది కలలో కూడా జరగదు... యేమిటో చెప్పు"

"వినోద్‌ను వెంటనే ఒక సైకియాట్రిస్టుకు చూపించాలి సుగుణాకర్..."

"సైకియాట్రిస్టుకా? ఎందుకు? వాడికేమన్నా పిచ్చిలేచిందా?" చిరాగ్గా అన్నాడు సుగుణాకర్.

"బాగా చదువుకున్నవాడివి... సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళాలి అని చెప్పగానే వాడికేమన్న పిచ్చి లేచిందా? అని నువ్వనడం బాగాలేదు. సైకియాట్రిస్టుల దగ్గరకు పిచ్చిలేచినవాళ్ళు మాత్రమే వెళ్ళరు... యేవైనా మానసిక సమస్యలున్నవాళ్ళు కూడా వెళ్తారు. టైఫాయిడ్, మలేరియా, బీపీ, డయాబెటీస్ లాంటివి శరీరాలకొచ్చే వ్యాధులు... శరీరానికిలాగే మన మనస్సుక్కూడా కొన్ని వ్యాధులొస్తాయి... పెరనాయిడ్, స్కిజొఫెర్నియా, హిస్టీరియా లాంటివి మనస్సుకొచ్చే వ్యాధులు. మనస్సుకొచ్చే వ్యాధుల్ని సైకియాట్రిస్టులు నయంచేస్తారు... మన వినోద్ ఒక మానసిక వ్యాధితో బాధపడ్తున్నాడని ఇటీవలి వాడి ప్రవర్తనను బట్టి నేను అర్థం చేసుకున్నాను... వాడిలో ఆ వ్యాధి ఇంకా ముదిరితే తీవ్ర పరిణామాలుంటాయి... నాకు బాగా తెలిసిన సైకియాట్రిస్టు - డా॥ నిర్మలానంద అని ఉన్నాడు. అతని దగ్గరకు మన వినోద్‌ను తీసికెళ్దాం... నేను కూడా వస్తాను... ఈరోజే నేను డా॥ నిర్మలానందకు ఫోన్‌చేసి అపాయింట్‌మెంట్ తీసుకుంటాను..." అన్నాను.

"వద్దు... ప్లీజ్... నువ్వాపని చెయ్యొద్దు... వాడు కొంచెం దిగులుగా కనిపిస్తున్నాడు గానీ నార్మల్‌గానే ఉన్నాడు. వాడి ప్రాబ్లెమ్ యేమిటో నాకు తెలుసు... వాడికి పెళ్ళి చేసుకోవాలని ఉంది. అందమైన అమ్మాయిలకేసి అదేపనిగా చూస్తుంటాడు. ఎవరినైనా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కూడా వాడికుంది... మేం

కూడా వాడికి సంబంధాలు చూస్తున్నాం... ఈ స్టేజిలో వాడిని సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్తే వాడికి పెళ్ళవుతుందా? వాడికో అందమైన అమ్మాయి భార్యగా దొరికి వాడికి తోడునీడగా నిలిస్తే వాడు హ్యాపీగా ఉంటాడు. వాడి కాన్ఫిడెన్స్ లెవెల్ కొంచెం తక్కువ. వాడికి అనుక్షణం అండగా ఉండే అమ్మాయి భార్యగా దొరికితే వాడి కాన్ఫిడెన్స్ లెవెల్ పెరిగి నార్మల్ అయిపోతాడు... నామీద, నా కుటుంబం మీద నీకేమాత్రం గౌరవం ఉన్నా వాడికేదో మానసిక వ్యాధి ఉందని, సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళాలని నాతోగాని మరెవరితోగాని అనొద్దు. వాడికి నేను త్వరలోనే ఓ మంచి సంబంధం చూసి పెళ్ళిచేస్తాను... దాంతో వాడి సమస్య తీరుతుంది... నువ్వు వాడి విషయంలో మరీ ఎక్కువగా ఆలోచించినట్టున్నావు... నువ్వేం వర్రీకాకు... చిన్నచిన్న సమస్యల్ని కూడా వాడు ఎగ్జాజిరేట్ చేసుకొని అతిగా ఆలోచిస్తాడని తెలుసు. అంతమాత్రానికే వాడ్ని సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళమని నువ్వు చెప్పడం బాగాలేదు. అయామ్ సారీ... నువ్వు మా ఫ్యామిలీకెంతో కావలసినవాడివి. మా శ్రేయోభిలాషివి. నువ్వు మంచి ఉద్దేశ్యంతోటే చెప్పి ఉంటావు... బట్ అయామ్ సారీ... నీ సలహాను పాటించలేను. ఇక్కడ మా బంధువర్గం చాలా పెద్దది. వాడ్ని సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళిన వార్త బయటకు పొక్కకుండా ఉండదు. అప్పుడింక ఈ జన్మలో వాడికి పెళ్ళి జరగదు. ఈ సోషల్ స్టిగ్మా గురించి నువ్వు ఆలోచించి ఉండవు... సైకియాట్రిస్టనగానే చాలామంది ఉలిక్కిపడ్తారు... వాడికేదో మెంటల్ వచ్చిందని గుసగుసలు ప్రారంభమౌతాయి... ఈ సామాజిక అపవాదును అంటే సోషల్ స్టిగ్మాను తట్టుకోవడం చాలా కష్టం. ముఖ్యంగా వాడికేదో మెంటల్ ప్రాబ్లెమ్ ఉందని తెలిస్తే ఎవరూ పిల్లనివ్వరు..." అంటూనే సుగుణాకర్ వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు.

"సోషల్ స్టిగ్మా గురించి నేనూ ఆలోచించాను. ఎవరో యేదో అనుకుంటారని మనం వాడి ఆరోగ్యాన్ని గురించి పట్టించుకోకుండా ఉంటే ఎలా..." అని నేను చెబుతోంటే సుగుణాకర్ నా మాటలు వినిపించుకోకుండా లేచి నిల్చొని "నాకింకేమీ చెప్పొద్దు... వాడికి పెళ్ళికావడం ముఖ్యం... పెళ్ళి చేస్తే వాడి సమస్య తీరుతుంది. వాడిని గురించి నువ్వేం వర్రీ కావద్దు" అని చెప్పి సుగుణాకర్ లేచి వెళ్ళిపోయాడు.

"దేవుడా! వీళ్ళను క్షమించు. వీళ్ళు చేస్తున్న తప్పులేమిటో వీళ్ళకు తెలీదు" అనుకున్నాను. సుగుణాకర్‌తో ఇంకా చాలాసేపు మాట్లాడి వినోద్‌ను సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళటానికి ఒప్పిద్దామనుకున్నాను. కానీ అతడు నాకా అవకాశం ఇవ్వలేదు.

వినోద్ నాకు మరోసారి ఫోన్ చేశాడు.

ఈసారి ఓ 20 మంది యూనివర్శిటీ విద్యార్థులు మోటారుబైక్‌ల మీద తనను ఛేజ్ చేస్తున్నారన్నాడు. వాళ్ళు తనను చంపెయ్యడం తథ్యం అన్నాడు. తనిప్పుడు ఎల్బీనగర్ చౌరస్తాలో ఉన్న ఓ చెట్టు వెనక దాక్కున్నాననీ, తనను వెంటాడుతున్నవాళ్ళు తనకోసం వెతుకుతున్నారని, వాళ్ళల్లో ఓ ఇద్దరి చేతుల్లో పిస్టల్స్ ఉన్నాయని, వెంటనే నన్ను పోలీసుల్ని తీసుకొని అక్కడకు వచ్చి తనను రక్షించాలని, తను ఇదే విషయాన్ని వాళ్ళ నాన్నకు చెబితే ఆయన అతని మాటల్ని నమ్మడం లేదనీ, మీరైనా నమ్మి తనను కాపాడాలని వేడుకున్నాడు. ఇలా గబాగబా మాట్లాడేసి ఫోన్ పెట్టేశాడు.

"నీకేంకాదు... భయపడకు..." అంటూ నేను చెప్పబోయిన మాటల్ని అతడు వినిపించుకోలేదు.

వినోద్‌లో జబ్బు ముదిరిపోతున్నదని అర్థమైంది. కానీ అతని విషయంలో నేనేం చెయ్యాలో తేల్చుకోలేకపోయాను. రెండు మూడు రోజులు ఈ సమస్యను గూర్చే ఆలోచించాను. మా ఆవిడతో చర్చించాను.

"మనమే వినోద్‌ను సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్దామా?" అని మా ఆవిడను అడిగాను.

"చాల్లెండి... ఊరుకొండి. మనమలా చేస్తే సుగుణాకర్ వాళ్ళ కుటుంబంతో మనకున్న సంబంధాలు చెడిపోతాయి. అయినా వాళ్ళకు లేని బాధ మనకెందుకండీ... పెళ్ళి చేస్తే ఆ అబ్బాయి బాగవుతాడని నాకూ అనిపిస్తోంది. వినోద్‌కేమీ కాదు... మీరీ విషయాన్ని గూర్చి ఎక్కువగా ఆలోచించకండి..." అంది మా ఆవిడ.

సుగుణాకర్ వినోద్ కోసం సంబంధాలు చూస్తున్నాడని తెలుస్తూనే ఉంది. త్వరలోనే యేదైనా ఓ సంబంధం కుదరవచ్చునని కూడా సుగుణాకర్ చెప్పాడు.

వినోద్ ఐదారురోజులకొకసారి తనను యూనివర్శిటీ విద్యార్థులు వెంటాడుతున్నారని ఎలాగో తప్పించుకుంటున్నానని ఫోన్ చేస్తూనే ఉన్నాడు.

"ధైర్యంగా ఉండాలి వినోద్... నీకేమీ కాదు... నీకు నేనున్నాను. నువ్వు లేని శత్రువుల్ని ఉన్నట్టుగా ఊహించుకుంటూ నిన్ను నువ్వు శిక్షించుకుంటున్నావు తప్ప నీకు నిజంగా సమస్యంటూ యేమీ లేదు. కాన్ఫిడెంట్‌గా ఉండు. ప్రతి చిన్నవిషయాన్ని ఎగ్జాజిరేట్ చేసుకోకు... సమస్యంతా నీ మనస్సులోనే ఉంది... నీ మనస్సును కంట్రోల్ చేసుకొని నీకు నువ్వు ధైర్యం చెప్పుకోవాలి... లేనిదాన్ని ఉన్నట్టుగా ఊహించుకోవడం మానేయ్యాలి..." అన్నాను.

"నా మాటల్ని మీరూ నమ్మటంలేదా అంకుల్... మీరూ మానాన్నలాగే నేను చెప్పిన మాటల్ని నమ్మడంలేదన్నమాట... అంతా నేనే లేనిదాన్ని

ఊహించుకుంటున్నాననుకుంటున్నారన్నమాట... ఇప్పట్నించి మీక్కూడా నా బాధల్ని, నా సమస్యల్ని చెప్పనంకుల్" అంటూ వినోద్ ఫోన్ పెట్టేశాడు.

అతడు ఫోన్ పెట్టేశాక నేను పొరపాటు చేశానేమో అనుకున్నాను. అతనితో లేనిదాన్ని ఉన్నట్టుగా ఊహించుకుంటున్నావని నేను చెప్పి ఉండాల్సింది కాదు. అతడు ప్రస్తుతం ఉన్న మానసిక స్థితిలో అతనికి నా మాటలు అర్థం కావు... అతన్ని నిజంగానే అతని శత్రువులు వేటాడుతున్నారన్న భ్రమను అతడు నిజమే అనుకుంటున్నాడు. అది నిజం కాదని ఎవరు ఎంతగా చెప్పినా దాన్నతడు అంగీకరించలేదు. ఒక మానసిక వైద్యుడి ద్వారా అతనికి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తేనే అతడికీ భ్రమ నుండి విముక్తి లభిస్తుంది. నామీద అతడు చాలా నమ్మకం పెట్టుకున్నాడు. నేనూ వాళ్ళలాగే అతన్ని నమ్మడం లేదని అనుకున్నప్పుడు అతడెంత హర్టయ్యాడో నేను అర్థం చేసుకోగల్గాను... కానీ అతనికీ విషయం తెలియజేయడం ఎలా?

అతని సమస్యను గూర్చి నేను డా॥ నిర్మలానందతో ఫోన్లో మాట్లాడాను... పెరనాయిడ్, స్కిజియోఫెర్నియా లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి... అతనొక్కసారి నా దగ్గరకు తీసుకురండి... అతన్ని బాగుచెయ్యొచ్చు" అన్నాడు నిర్మలానంద.

మరోసారి సుగుణాకర్‌తో మాట్లాడి వినోద్‌ను నిర్మలానంద దగ్గరకు తీసికెళ్దామనుకున్నాను. ఇదివరకటిలా వినోద్ నాకు ఫోన్ చెయ్యడం మానేశాడు.

సుగుణాకర్‌కు ఫోన్ చేస్తే "వాడు బాగానే ఉన్నాడు... త్వరలోనే వాడికి పెళ్ళిచేస్తాం... నువ్వేం వర్రీకాకు" అన్నాడు.

ఇది జరిగిన వారం రోజులకు పిడుగులాంటి వార్త... వినోద్ వాడి రూంలో ఉన్న సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని!

వినోద్ చావుకు కారకుల్లో నేను కూడా ఒకడినేమో అన్న ఆలోచన నా హృదయాన్ని కలచివేసింది.

సోషల్ స్టిగ్మా లేక సామాజిక అపవాదు అనే అపోహ లేక అజ్ఞానం ఎంతటి అనర్థానికి దారితీస్తుందో ఆలోచిస్తే భయమేసింది.

✧✧✧✧✧

– 'సురభి' (మాసపత్రిక)